


# బంధాలు

— కాకాని కమల

`బాగా ముసురుపట్టి సన్నగా చినుకు మొదలయ్యింది.

చల్లగా ఈదరగాలి.

టైమ్ ఆట్టే కాలేదు. ఏడే.

కానీ ఆకాశం మబ్బు పట్టటంతో ఆ చీకటి మరింత దట్టంగా ఉంది.

ఆఫీసులో అర్జంటు పని ఉండటంతో ఆరు గంటల దాకా అక్కడే సరిపోయింది.

బస్సులు పట్టుకుని ఇంటికి వచ్చేసరికి రోజూ కంటే ఓ గంట ఆలస్యం అయిపోయింది.

జేబురుమాలుతో ముఖం మీద పడ్డ చినుకులు తుడుచుకుంటూ బస్సు స్టాపు నుంచి వేగంగా ఇంటికి వచ్చాడు రామం.

వీధిలైట్లు వెలగటం లేదు. అంతా చీకటిగా ఉంది.

ఇంటి చీడిలు ఎక్కి తలుపు తట్టబోయిన రామం ఎవరో సన్నగా మూలుగుతున్నట్లు అనిపించి తల తిప్పి చూశాడు.

ఎదురింటి మేడ మీంచి వస్తున్న సన్నటి వెలుగులో అరుగు చివర ఎవరో ముడుచుకుని పడుకొన్నట్లు కనిపించింది. మూలుగు అక్కడ్నుంచే వస్తూంది. కాని ఆ ఆకారం సరిగా తెలియటం లేదు.

"ఎవరు? ఎవరది?" అంటూ అరుగు వారగా వెళ్లాడు.

సమాధానం లేదు. కాని వుండి వుండి మూలుగుతున్నాడు.

గుడ్డి వెలుతురులో క్రాపు, పండిన గుబురు మీసాలు కనిపిస్తున్నాయి.

మగవాడని అర్థం అయిపోయింది.

నల్లకంబళి లాంటిది మెడదాకా కప్పుకున్నాడు.

"ఎవరయ్యా? ఎవరు నువ్వు? నీకిక్కడేం పని" గద్దిస్తున్నట్లు అన్నాడు రామం.

ఇలా దిక్కులేని వాళ్ళల్లా రాత్రిళ్ళు ఇంటి అరుగు మీద చేరి అర్ధరాత్రి గుట్టుచప్పుడు కాకుండా ఇల్లు దోచుకున్న వైనాలు చాలా విన్నాడు రామం. అందుకే అక్కడ్నుంచి వెళ్ళమని గద్దించాడు.

కాని ఆ వ్యక్తి నుంచి సమాధానం లేదు. బయట వాన మొగులు ఎక్కువైంది.

రామం తలుపు తట్టి "కాత్యా కాత్యా" అంటూ పిలిచాడు.

"వస్తున్నా నాన్నా!" అంటు ఎనిమిదేళ్ళ కాత్యాయిని వచ్చి తలుపు తీసింది.

రామం తల్లి పేరు కాత్యాయిని. అందుకే కూతురికి ఆ పేరు పెట్టుకున్నాడు.

"ఇంటి ముందు లైట్ వెయ్యలేదేం తల్లీ?"

"లైటు ఎందుకో వెలగటం లేదు నాన్నా. బల్బు మాడిపోయిందో ఏమో!"

"అలాగా! నా గదిలో బల్లమీద టార్చి లైటుంది. ఇలా పట్రా. ఇక్కడ ఎవరో పడుకున్నారు."

కాత్యా తెచ్చిన టార్చి అందుకుని ఆ వ్యక్తి ముఖం మీద ఫోకస్ చేస్తూ - "ఎవరు? ఎవరయ్యా? ఇక్కడ పడుకున్నావేంటి?" అంటూ ఆ వ్యక్తి భుజం మీద అరచేత్తో తడుతూ గట్టిగా పిలిచాడు. విపరీతమైన జ్వరంతో ఆ వ్యక్తి ఒళ్ళు కాగిపోతూంది. అపస్మారకంగా పడి వున్నాడు. ఎన్నో సార్లు తట్టి పిలిస్తే గాని "ఆఁ" అన్న శబ్దం రాలేదు. తనకి తెలియకుండానే సన్నగా మూలుగుతున్నాడు.

రామం గట్టిగా పిలవడంతో అతి కష్టంతో కళ్ళు తెరిచి లేవటానికి ప్రయత్నించాడు.

జ్వర తీవ్రతకి కాబోలు... ఎర్రగా నిప్పు కణికలా ఉన్నాయి ఆ వ్యక్తి కళ్ళు. ఆ వ్యక్తి నుదుటి మీద కుడివైపు కంటి చివరగా ఉన్న కంది బద్దంత పుట్టు మచ్చ చూస్తూనే రామం కళ్ళు విశాలంగా అయ్యాయి.

ఆ వ్యక్తిని గుర్తుపట్టినట్లు ఉద్వేగంతో "నాన్నా" అనబోయి ఇష్టం లేనట్లు చప్పున నాలికని వెనక్కి సంభాళించుకున్నాడు.

అప్పటికే ఆ వ్యక్తి నెమ్మదిగా దుప్పటి తొలగించి లేచి కూర్చొని రామం ముఖంలోకి తేరిపార చూట్టం మొదలుపెట్టాడు.

"నాన్నా! నువ్వా?"

ఆ వ్యక్తి ఒకసారి కళ్ళు మూసి తెరిచి కొడుకుని గుర్తు పట్టినట్లు కనురెప్పలు కదిలించాడు.

తండ్రి కొడుకు చూసుకోక పదిహేను సంవత్సరాలు గడిచాయి మరి!

కాత్య లైటు చూపిస్తూంటే తండ్రి రెక్క పట్టుకుని నడిపిస్తూ ఇంట్లోకి తీసుకువచ్చాడు.

లోపల వంట చేస్తున్న వసంతలక్ష్మి "ఎవరండీ?" అంటూ అలికిడికి ఇవతలికి వచ్చింది.

"నువ్వే చూడు" అంటూ తండ్రిని జాగ్రత్తగా మంచం మీదికి చేర్చాడు.

లైటు వెలుగులో ఆ వ్యక్తి ముఖంలోకి చూసిన వసంత "మావయ్యా?" అంది వింతగా.

కానీ ఆ వ్యక్తి చాలా అపస్మారకంగా ఉన్నాడు. ఎవర్నీ గుర్తించలేకపోతున్నాడు. జ్వర తీవ్రత హెచ్చుగా వుండటంతో మైకం కమ్ముతున్నట్లు మంచంలో వాలిపోయాడు.

రామం దుప్పటి కప్పి లోపలికి వచ్చాడు.

"ఈయన మీకు ఎక్కడ కనిపించాడండీ?"

"వెతికితే కనిపించే మనిషేనా?"

"మరి?"

"మన అరుగు మీద పడుకున్నాడు. ఎవరా అని చూస్తే ఈయన."

"అలాగా."

"చేతిలో డబ్బు, ఒంట్లో ఓపిక వున్నంత కాలం ఊళ్ళు పట్టుకుని తిరిగాడు. జల్సాలు చేశాడు. డబ్బు, ఓపిక కరిగిపోయాయి. ఎవరాదరిస్తారు? అయినవాళ్ళు జ్ఞాపకం వచ్చి ఉంటారు. వెతుక్కుంటూ వచ్చాడు."

వంట అయ్యింది. వసంత భోజనానికి సిద్ధం చేసింది.

"నాన్నా భోజనం చేస్తావా?" మళ్ళీ భుజం మీద తట్టి రెండు మూడుసార్లు లేపి అడిగాడు.

"వద్దు. జ్వరంగా ఉంది" అన్నట్లు సైగచేశాడు. మాట్లాడటానికి కూడా ఓపిక లేనట్లుంది. ఎన్నాళ్ళ నుంచి సుస్తీ పడ్డాడో మరి....

వసంత పాలలో హార్లిక్స్ కలిపి తెచ్చి ఇచ్చింది.

తాగి పడుకున్నాడు.

భోజనం చేసి తండ్రి మంచం దగ్గరే మంచం వేసుకుని పడుకున్నాడు రామం.

నాన్న పక్కన ఉన్న రామానికి అమ్మ జ్ఞాపకం వచ్చింది.

తండ్రితో మాట్లాడటం గాని ఆయన్ని లోపలికి పిలవటం గానీ ఇష్టం లేదు.

కానీ తప్పదు. చివరి దశలో ఉండి వెతుక్కుంటూ వచ్చాడు. కొడుకుగా ఆదరించక తప్పదు. కొన్ని బంధాలు అలాంటివి.

కళ్ళు మూసుకున్నా అమ్మ జ్ఞాపకం వస్తూంది.

అందరూ అన్నం తిని బ్రతుకుతారు.

కాని తను అమ్మ ప్రేమ తిని బ్రతికాడు.

అప్పుడు.....

తనకి చాలా చిన్నతనం. తను, చెల్లి, అమ్మ ఒకటి, నాన్న ఒక్కడూ ఒకటి.

అప్పుడు తమకు మెరక వీధిలో ఓ పెంకుటిల్లు ఉండేది. ఊరి చివర ఎనిమిదెకరాల పొలం ఉండేది.

నాన్న బాగా జల్సారాయుడు. మొదట్నుంచీ వ్యసనపరుడు. పేకాట, మందు, మగువ.

ఊళ్ళో వుంటే ఎప్పుడూ పగలు - రాత్రి చీట్లాట క్లబ్బులోనే కాపురం. అమ్మ నాన్న ఎప్పుడూ పోట్లాడుకునేవారు.

"డబ్బు అలా తగలేస్తే ఇల్లు ఎలా గడవాలి? పిల్లల గతేమిటి?" అని అమ్మ ఏడ్చేది.

"నా ఆస్థి నా ఇష్టం" అంటూ అమ్మని ఒళ్ళు విరిగేలా బాదేవాడు నాన్న.

అమ్మ ఒంటిమీద బంగారం, ఇంట్లో చిన్నా చితకా వెండి అయినా సరే అమ్మి తాగుడికి తగలేశాడు. ఆ తరువాత మెల్లిగా ఒకదాని వెంట ఒకటిగా పొలాలు అమ్మటం మొదలుపెట్టాడు.

అమ్మిన డబ్బు చేతికి రాగానే ఊళ్ళోంచి పరారయ్యేవాడు. ఎక్కడ తిరిగేవాడో ఏం చేసేవాడో తెలియదు.

కొన్ని నెల్లపాటు అయిపు అజ ఉండేది కాదు.

ఇంటి దగ్గర పెళ్ళాం బిడ్డలు ఎలా బతుకుతున్నారో అన్న ధ్యాసే లేదు. మమకారం అసలే లేదు.

చేతిలో డబ్బు అయిపోగానే ఇంటికి వచ్చేవాడు.

ఓ నెలా రెండు నెల్లపాటు ఇంట్లో కుదురుగా ఉండేవాడు. అంతే మళ్ళీ పొలం అమ్మి డబ్బు తీసుకుని ఉడాయించేవాడు.

అమ్మ ఎదురుతిరిగితే దెబ్బలే గతి. చిన్న పిల్లలని కూడా చూడకుండా కొట్టేవాడు తనని, చెల్లిని.

"తిండి పెట్టకపోయినా పిల్లల్నెందుకు కొడతారు?" అని అమ్మ అడ్డంపడితే "నా ఆస్థి నా ఇష్టం. నువ్వెవత్తివే. నువ్వు నీ పిల్లలు ఏట్లో పడి చావండి" అనేవాడు.

అంత చిన్న వయస్సు, తెలిసీ తెలియని తనం అయినా రామంకి తండ్రి మనిషిలా కాక రాక్షసుడిలా కనిపించేవాడు.

ఆఖరికి పొలాలు కూడా హరించుకుపోయాక ఎనభై వేలకి ఇల్లు బేరం పెట్టాడు.

అప్పుడు చాలా గొడవయ్యింది. అమ్మ నాన్నకి బాగా అడ్డం తగిలింది. అయినా నాన్న విన్లేదు సరికదా అమ్మని నెత్తురు కళ్ళపడేలా చావగొట్టాడు. చేతికి ఏది దొరికితే దాంతో కొట్టేవాడు. ఆ రోజు... అలాగే కూరలు తరుగుతున్న అమ్మ మీద కత్తిపీట ఎత్తాడు. అమ్మ భయంతో పెరట్లోకి పరిగెత్తింది. నాన్న కత్తిపీట విసిరాడు.

కాలి మడమపైన వాడిగా ఆ కత్తి దిగింది.

ఎంత రక్తం పోయిందో. ఆ రోజు అమ్మ కంటే తను ఎక్కువ ఏడ్చాడు.

ఇంట్లో ఎంతో గొడవ జరిగింది.

అయినా నాన్నని ఎవరూ ఆపలేకపోయారు. ఇల్లు అమ్మేసి ఊళ్ళోంచి పారిపోయాడు. ఎవరో రత్నం అనే ఆవిడతో పట్నంలో కాపురం పెట్టాడని తెలిసింది.

ఆఖరికి అమ్మ ఊరి పెద్దల్ని కల్సి మొత్తుకుంటే అతికష్టంతో వాళ్ళంతా కలసి ఇల్లు అమ్మిన డబ్బులోంచి పాతికవేలు అమ్మకి ఇప్పించడం గగనం అయిపోయింది.

ఆ డబ్బుతో ఊరి చివర అమ్మ కొంత జాగా కొని తాటాకులతో పాక వేయించింది. ఇంటి చుట్టూ ఇనుప తీగలు చుట్టించింది.

తల్లి ఆ ఇంటిని "కాత్యాయిని" అంటూ ఆవిడ పేర్నే రిజిస్టరు చేయించి తన తదనంతరం కొడుక్కి అందే తనకి చెందేలా రాయించింది. ఇంటి చుట్టూ ఖాళీ జాగాలో ఆనప, బీర, దొండ, కాకర లాంటి కూరగాయ పాదులు పెట్టి ఇరుగు పొరుగులకి అమ్మేది. ఇల్లు గడవక ఊళ్ళో పెద్ద రెడ్డిగారింట్లో పనికి కుదురుకుంది.

కానీ నాన్న విసిరిన కత్తి కాలికి బాగా గాయం చేసింది. సెప్టిక్ అయ్యింది. ఎన్ని మందులు వాడినా తగ్గలేదు. చివరికి ఆ నొప్పి బాగా మోపు చేసి జ్వరం తగిలి బాగా బాధపడి అమ్మ చనిపోయింది.

అమ్మ పోయేనాటికి తను ఇంటర్ చదువుతున్నాడు. చెల్లి పదవ తరగతిలోకి వచ్చింది.

పెద్దరెడ్డి గారు జాలిపడి ఆయన పలుకుబడి ఉపయోగించి ఊళ్ళో బ్యాంక్‌లో అటెండర్‌గా టెంపరరీ పోస్టు ఇప్పించారు. మూడేళ్ళు అలా చేశాక వాళ్ళు పర్మనెంట్ చేసి జీతం పెంచారు.

తను ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేసి క్లర్కు పోస్టుకి రాసి అటెండరు నుంచి క్లర్క్ కమ్ టైపిస్టుగా ప్రమోట్ అయ్యాడు. అదంతా పెద్దరెడ్డి గారి పలుకుబడి వల్లే జరిగింది.

తను అటెండర్ ఉద్యోగంలో ఉండగానే మావయ్య "ఒరే రామూ! నీకభ్యంతరం లేకపోతే నా కూతురు వసంతని నువ్వు చేసుకో, నీ చెల్లెల్ని నా కొడుక్కి చేసుకుంటా. అంటే కుండమార్పిళ్ళు అన్నమాట" అన్నాడు.

తను ఒప్పుకున్నాడు.

నాన్న అమ్మని రొష్టు పెడుతూంటే మావయ్య చాలాసార్లు తమని ఆదుకున్నాడు. నాన్న ఇల్లు అమ్మినప్పుడు కూడా ఊళ్ళో పెద్ద మనుషుల్ని పోగేసి పాతిక వేలు ఇప్పించింది కూడా మావయ్యే.

పెళ్ళయిన రెండేళ్ళకి తనకి అమ్మాయి పుట్టింది. కాత్యాయిని అని పేరు పెట్టుకున్నాడు. అమ్మ లేకపోయినా రోజూ అమ్మని తల్చుకొంటున్న ఆనందం కోసం తను "అమ్మా కాత్యా" అని పిలుస్తాడు కూతుర్ని తృప్తిగా.

దాదాపు పదిహేను సంవత్సరాలు గడిచిపోయింది. ఇంత జరిగినా నాన్న జాడ తెలియలేదు. ఉన్నాడో, లేదో సందేహమే.

అలాంటిది...

ఇన్నేళ్ళ తర్వాత చుక్క తెగి పడినట్లు...

"ఊ... ఊ...."

నాన్న మూలుగుతున్నాడు. కొద్దిగా మంచంలో కదలిక.

లేచి లైట్ వేశాడు.

"నాన్నా" అని పిలవటానికి ఎందుకో నోరు రావటం లేదు.

"ఏం కావాలి?" అన్నాడు కఠినమవుతున్న గొంతుని సాధ్యమైనంత సౌమ్యంగా మార్చుకొంటూ.

"మంచినీళ్ళు" అన్నట్లు సైగచేశాడు.

## మీకు తెలుసా?

ఫ్రాన్స్ దేశంలో వెలువడుతున్న నవలలలో నూటికి 67 స్త్రీలచే రాయబడుతున్నాయి.

***

మార్గరేట్ మిచెల్స్ అనే రచయిత్రి వ్రాసిన "గాన్ విత్ దివిండ్" అనే నవల కోటి ప్రతులు అమ్ముడయ్యాయి. ఈ నవలపై ఆమె 2 కోట్ల రూ॥లు సంపాదించింది.

***

విశ్వ విఖ్యాత ఆంగ్ల రచయిత్రి 'అగథా క్రిస్టీ' 80 పుస్తకాలు రాసింది. ఇవి 103 భాషల్లోకి అనువదింపబడి 40 కోట్ల ప్రతులు అమ్ముడయి 1000 కోట్ల రూ॥ల ఆదాయం వచ్చింది.

***

రెండవ ప్రపంచ యుద్ధం ముగిసే సమయంలో అమెరికావారు జపాన్‌లోని 'హిరోషిమా'పై 1945 ఆగష్టు 6 ఉదయం 8 గ॥ 15ని॥లకు, 'నాగసాకి'పై ఆగష్టు 9 న రెండు అణుబాంబులు వేశారు. ఆ దాడిలో లక్షపైగా మరణిస్తే, రెండు లక్షలమంది క్షతగాత్రులయ్యారు. అప్పుడు ఉత్పన్నమైన రేడియేషన్ వలన క్యాన్సర్, పాండు రోగం మొదలగు వ్యాధులతో నేటికీ ఏటా సుమారు 2,500 మంది చనిపోతున్నారు.

ఆళ్ల లక్ష్మీప్రియ
అనకాపల్లి

తెచ్చి ఇచ్చాడు.

మెల్లిగా లేచి నీళ్ళు తాగి ఇల్లంతా కలియజూస్తూ "మీ చెల్లి, అమ్మా ఏరి...?" అన్నాడు.

"చెల్లికి పెళ్ళి అయిపోయింది. మావయ్య కొడుకు చేసుకున్నాడు. నేను మావయ్య కూతుర్ని చేసుకున్నాను."

"ఆ బల్లమీద పడుకున్నది నీ కూతురా..."

"మరి... మరి... మీ అమ్మ?" మొఖం చెల్లనట్లు తల పక్కకి తిప్పుకున్నాడు.

"ఆ రోజు నువ్వు కత్తిపీట విసిరావుగా. ఆ దెబ్బ సెప్టిక్ అయి అమ్మ చచ్చిపోయింది" తన కసంతా మాటల్లో చూపించాడు.

"ఉష్..."హైరానాగా తల దిండు కానించుకుని గుండెల మీద అరచేత్తో రుద్దుకోసాగాడు. ఆయన కళ్ళ నుంచి నీళ్ళు కారసాగాయి. క్షణ క్షణానికి ఆ కన్నీరు ఉధృతం కాసాగింది.

మనిషి లోలోన కుమిలిపోతున్నట్లు అలా కన్నీరు కార్చసాగాడు. కానీ -

ఎందుకొచ్చిన కన్నీరు? మొసలి కన్నీరు. వ్యర్థం అయిన కన్నీరు. ఆ కన్నీరు చచ్చిపోయిన తన తల్లిని బ్రతికిస్తుందా?

పోయిన ఆస్థి, పొలాల్ని, సుఖసంతోషాల్ని తెచ్చి ఇస్తుందా?

తన బాల్యంలోని చేదుని తుడిచివేస్తుందా?

కానీ కొడుకుగా, తన తండ్రిని ఈ అవసాన దశలో తనకి ఇష్టం వున్నా లేకున్నా ఆదుకోక తప్పదు - లోకం కోసం! అనుకున్నాడు రామం, తల్లి జ్ఞాపకాలతో చెమ్మగిలిన కళ్లు తుడుచుకుంటూ.